సాక్షి
ఖమ్మం
శుక్రవారం । 2 । జూన్ । 2023



'బడి బాట'కు సన్నద్ధం!

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపే లక్ష్యంగా శనివారం నుంచి బడిబాట నిర్వహించనున్నారు.

8లో



తెలంగాణ, బిహార్ విజయం

ఆల్ ఇండియా మహిళా టీ-20 క్రికెట్ టోర్నీలో మూడో రోజు తెలంగాణ, బిహార్ జట్లు విజయం సాధించాయి.

8లో

గరిష్టం / కనిష్టం
44° / 27°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం గరిష్ట స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం నుంచే ఎండ మొదలై గంటగంటకు పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి ఫుట్‌బాల్ టోర్నీ

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో శుక్రవారం నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి ఫుట్‌బాల్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా కార్యదర్శి కె.ఆదర్శ్‌కుమార్ తెలిపారు. ఇటీవల ముగిసిన వేసవి శిబిరాల్లో ఫుట్‌బాల్ శిక్షణకు హాజరైన బాలబాలికలకు అండర్-10, 14 విభాగాల్లో టోర్నీ ఏర్పాటుచేస్తున్నామని పేర్కొన్నారు.

నేడు బాలికల ఎంపిక పోటీలు

జూనియర్ విభాగంలో బాలికల ఫుట్‌బాల్ జట్టు ఎంపికకు శుక్రవారం పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆదర్శ్‌కుమార్ తెలిపారు. ఈనెల 4నుంచి 7వ తేదీ వరకు మంచిర్యాలలో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనే జట్టు ఎంపికకు ఈ పోటీలు నిర్వహిస్తుండగా, 2007నుంచి 2009 మధ్య జన్మించిన క్రీడాకారిణులు హాజరుకావాలని, వివరాలకు 99896 47696 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

థర్మకోల్‌తో 'అమరజ్యోతి' స్మారక చిహ్నం

- రూపొందించిన ఉపాధ్యాయుడు సుధాకర్



స్మారక చిహ్నం నమూనాతో సుధాకర్

కల్లూరు/కల్లూరు రూరల్: హైదరాబాద్ హుస్సేన్‌సాగర్ ఒడ్డున నిర్మించిన 'తెలంగాణ అమరవీరుల జ్యోతి' స్మారక చిహ్నంను తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రారంభించనున్నారు. ఈ మేరకు స్మారక చిహ్నం నమూనాను కల్లూరు మండలం చెన్నూరుకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు దంతాల సుధాకర్ థర్మకోల్ షీట్‌తో తయారుచేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మారక చిహ్నం ప్రత్యేకతలను విద్యార్థులు, ప్రజలకు తెలియచేయాలని రూపొందించినట్లు తెలిపారు. దీనిని తయారుచేయడానికి 16 గంటల సమయం పట్టిందని వెల్లడించారు.

లంకాసాగర్ పీహెచ్‌సీకి కాయకల్ప అవార్డు

పెనుబల్లి: పెనుబల్లి మండలం లంకాసాగర్ పీహెచ్‌సీకి కాయకల్ప అవార్డు లభించింది. పీహెచ్‌సీలో పరిశుభ్రత, వ్యాధుల వ్యాప్తి నివారణ తీసుకుంటున్న చర్యలు, బయోమెడికల్ వేస్టేజ్ నిర్వహణతో పాటు మెరుగైన వైద్య సేవలందించినందుకు గాను కేంద్రప్రభుత్వ కుటుంబ సంక్షేమ ఆరోగ్య మిషన్ కాయకల్ప అవార్డును ప్రకటించింది. ఈసందర్భంగా డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ సౌమ్య, సిబ్బందిని జెడ్పీటీసీ చెక్కిలాల మోహన్‌రావు, ఎంపీపీ లక్కినేని అలేఖ్య, సర్పంచ్ మందడపు అశోక్‌కుమార్ అభినందించారు.

బీక్యాతండా పల్లె దవాఖానాకు..

కారేపల్లి: కారేపల్లి మండలం బీక్యాతండా హెల్త్‌వెల్ సెంటర్(పల్లె దవాఖానా) కాయకల్ప అవార్డుకు ఎంపికైంది. ఇక్కడకు వచ్చే వారికి అందిస్తున్న వైద్యసేవలతో పాటు ఇతర అంశాల ఆధారంగా అవార్డుకు ఎంపిక చేశారని కారేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సురేష్ తెలిపారు. పల్లె దవాఖానా వైద్యురాలు హిమబిందు, ఏఎన్‌ఎం ఉండం రాధ, విజయలక్ష్మి కృషితో అవార్డు లభించిందని పేర్కొన్నారు.

భానుడు భగభగ

- గరిష్టంగా 44.8 డిగ్రీల ఉష్ణోగ్రత

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో ఎండలు భగభగమంటున్నాయి. విపరీతమైన వేడి, వడగాలులతో ప్రజలు అతలాకుతలమవుతున్నారు. గురువారం జిల్లాలో అత్యధికంగా ఖమ్మం అర్బన్ మండలం ఖానాపురం(పీఎస్), ముదిగొండ మండలం పమ్మి, నేలకొండపల్లిల్లో 44.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. తల్లాడ మండలం కుర్నవల్లిలో నమోదైన 40 డిగ్రీల ఉష్ణోగ్రతే జిల్లాలో తక్కువ కావడం గమనార్హం. ఇక బాణాపురంలో 44.7, ముదిగొండ, పల్లెగూడెం, సత్తుపల్లి, చింతకానిల్లో 44.5, ఖమ్మం ఎన్నెస్పీ క్యాంపు, పెనుబల్లి, ఖమ్మం ప్రకాశ్‌నగర్‌లో 42.9, బచ్చోడులో 42.7, గంగారంలో 42.6, తిమ్మారావుపేట, పంగిడిలో 42.5, తల్లాడలో 42.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలపై 13న సమీక్ష

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలపై ఈనెల 13వ తేదీన హైదరాబాద్‌లోని డీవైసీఎల్సీ కార్యాలయంలో సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి హాజరు కావాలని సింగరేణి అధికారులు, వివిధ కార్మిక సంఘాల నాయకులకు డీవైసీఎల్సీ కార్యాలయం నుంచి లేఖలు పంపించినట్లు సమాచారం. సింగరేణిలో ఎన్నికలు నిర్వహించాలని ఏఐటీయూసీ నాయకులు గత నవంబర్‌లో హైకోర్టును ఆశ్రయించగా మూడు నెలల్లో ఎన్నికలు నిర్వహించాలని డిసెంబర్‌లో కోర్టు ఆదేశించింది. అయితే, సంస్థ విజ్ఞప్తితో ఇచ్చిన గడువు కూడా ముగియగా ఎన్నికలపై చర్చించేందుకు సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

మాది అభివృద్ధి మంత్రం

తెలంగాణ ఏర్పడిన తొమ్మిదేళ్లలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అభివృద్ధి కొత్త పుంతలు తొక్కింది. ఖమ్మం నగరంలో గోళ్లపాడు చానల్ ఆధునికీకరణ, లకారం ట్యాంక్‌బండ్, అధునాతన బస్టాండ్, కేఎంసీ భవనం, ఐటీ హబ్, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీతారామ ప్రాజెక్టు, పామాయిల్ ఫ్యాక్టరీ, భక్తరామదాసు ఎత్తిపోతల పథకం ఇలా చెప్పుకుంటూ పోతే అనేకం ఉన్నాయి. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో ఉమ్మడి జిల్లాపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి పనులు చేపట్టాం. గత 75 ఏళ్లలో జరగని అభివృద్ధి ఈ తొమ్మిదేళ్లలో చేసి చూపించాం. ఇక నాపై వస్తున్న విమర్శలేవీ పట్టించుకోను. ప్రజల ఆశీస్సులు ఉన్నంత వరకు నన్నెవరూ ఏమీ చేయలేరు. అభివృద్ధే మా మంత్రం.. అభివృద్ధినే నమ్ముకుని ముందుకు సాగుతున్నా... అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు శుక్రవారం నుంచి మొదలుకానున్న నేపథ్యాన మంత్రి 'సాక్షి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సంబురాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరిన మంత్రి ఇంటర్వ్యూలో చెప్పిన వివరాలు ఆయన మాటల్లోనే... – సాక్షిప్రతినిధి, ఖమ్మం



SAKSHI INTERVIEW సాక్షి

- ఉమ్మడి జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాం
- సీతారామ, భక్తరామదాసుతో పుష్కలంగా సాగునీరు
- ఈ విద్యాసంవత్సరం నుంచే ఖమ్మం మెడికల్ కళాశాల
- విమర్శలను పట్టించుకోను.. ప్రజల ఆశీస్సులే శ్రీరామరక్ష

'సాక్షి' ఇంటర్వ్యూలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

'మెడికల్' కల సాకారమైంది..

జిల్లాలో మెడికల్ కళాశాల ఏర్పాటు కావడం ఆనందంగా ఉంది. వంద ఎంబీబీఎస్ సీట్లు మంజూరు కాగా, నిర్మాణ పనులకు ప్రభుత్వం రూ.166 కోట్లు కేటాయించింది. పాత కలెక్టరేట్, ఆర్‌అండ్‌బీ కార్యాలయం, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి పరిధిలోని మొత్తం 30.23 ఎకరాలు మెడికల్ కళాశాలకు బదలాయించింది. జిల్లా ఆస్పత్రిని మెడికల్ కళాశాలకు అనుసంధానం చేసింది. ఈ విద్యా సంవత్సరం నుంచి ఖమ్మంలో తరగతులు మొదలుకానుండడంతో మరిన్ని వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. ఇక కొత్తగూడెంలో మెడికల్ కళాశాల తరగతులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి.

ఆధునిక హంగులతో..

ఎన్నెస్పీ క్యాంపులోని ఏడెకరాల్లో నూతనంగా బస్టాండ్ నిర్మించుకున్నాం. అలాగే ప్రజలకు అందుబాటులో ఉండేలా పాత బస్టాండ్‌ను పల్లెవెలుగు బస్సుల కోసం వినియోగిస్తున్నాం. ఇక అన్ని హంగులతో కార్పొరేషన్‌కు రూ.22కోట్లతో నూతన కార్యాలయాన్ని నిర్మించాం. ఖమ్మం-వైరా ప్రధాన రహదారి పక్కన వీవీ పాలెంలో నిర్మించిన నూతన కలెక్టరేట్ ఖమ్మంకే తలమానికంగా నిలుస్తోంది. అలాగే కొత్తగూడెంలోని పాల్వంచ రోడ్డులో నూతన కలెక్టరేట్ నిర్మించగా అన్ని శాఖలు అక్కడే కొలువుదీరడంతో ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటోంది.

ఐటీ హబ్‌తో ఉద్యోగావకాశాలు

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల కోసం జిల్లా యువత హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లే అవసరం లేకుండా నగరంలోనే ఐటీ హబ్ నిర్మించుకున్నాం. రూ.25కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ హబ్‌లో పలు కార్యకలాపాలు సాగిస్తుండగా 350 మంది యువతకు ఉపాధి లభించింది. రెండో దశ ఐటీ హబ్ కూడా మంజూరైంది.

ప్రాజెక్టులతో సస్యశ్యామలం

నీటి పారుదల ప్రాజెక్టులతో ఉమ్మడి జిల్లా సస్యశ్యామలమవుతోంది. భక్తరామదాసు ఎత్తిపోతల పథకం ద్వారా పాలేరు నియోజకవర్గంలోని 27 గ్రామాల పరిధిలో 60వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. 2016 ఫిబ్రవరిలో సీఎం కేసీఆర్ ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగా.. 2017 జనవరిలో ప్రారంభించుకున్నాం. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లోని దాదాపు 9.36 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా సీతారామ ఎత్తిపోతల పథకాన్ని రూపొందించాం. సీఎం కేసీఆర్ ముందుచూపుతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పూర్తయితే రైతులకు నీటి ఇబ్బందులు తొలగుతాయి. ప్రస్తుతం సత్తుపల్లి నియోజకవర్గంలోని యాతాలకుంట, తిరుమలాయపాలెం మండలంలో టన్నెల్ పనులు జరుగుతున్నాయి.

సంక్షేమం.. సంతృప్తికరం

ఉమ్మడి జిల్లాలో అభివృద్ధితోపాటు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించామన్న తృప్తి ఉంది. దళితబంధు కింద రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన చింతకాని మండలంలో 3,461 మందికి రూ.346కోట్ల విలువైన యూనిట్లు అందాయి. అలాగే జిల్లాలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ జరుగుతోంది. ఖమ్మం నగరం, కొత్తగూడెంలో సెంట్రల్ లైటింగ్, పార్కులు, వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ తదితర సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. అద్భుతమైన రోడ్లు నిర్మించుకున్నాం. కాలనీల్లో సిమెంట్ రోడ్లు పూర్తయ్యాయి. సీఎం కేసీఆర్ ఆశీస్సులతో ఉమ్మడి జిల్లాలో చేసిన అభివృద్ధి కళ్లముందు కనిపిస్తుంది.. ఇదే స్ఫూర్తితో మరింత అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా కృషి చేస్తాం.

గోళ్లపాడుకు కొత్త కళ

గతంలో మురుగునీటితో ఉన్న ఖమ్మంలోని గోళ్లపాడు చానల్ నేడు అద్భుతంగా మార్చుకున్నాం. ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.70 కోట్లు కేటాయించగా సుమారు 10.60 కి.మీ. మేర కాల్వను పూర్తిగా ఆధునికీకరిస్తున్నాం. వర్షపు నీరు, మురుగునీరు వెళ్లేలా వేర్వేరుగా కాల్వలు నిర్మించడంతో పాటు చానల్‌కు ఇరువైపులా ఉన్న 812 కుటుంబాలకు వెలుగుమట్ల వద్ద ఇళ్ల స్థలాలను కేటాయించాం. ఇక్కడ అన్ని సౌకర్యాలు కల్పించి తాగునీటి పైపులైన్ కూడా ఏర్పాటు చేశాం. అలాగే లకారం ట్యాంక్‌బండ్ ఖమ్మం వాసులకు ఆహ్లాదాన్ని అందిస్తోంది. కేబుల్ బ్రిడ్జి, రోప్ సైక్లింగ్, వాకింగ్ ట్రాక్, మ్యూజికల్ ఫౌంటెన్, ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ పార్క్, ఫుడ్ కోర్టులు అందుబాటులోకి వచ్చాయి.

అవతరణ సంబురం



రంగురంగుల లైట్లు, ఫౌంటెన్ నడుమ తెలంగాణ తల్లి విగ్రహం

- రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలకు అంతా సిద్ధం
- నేటి నుంచి 21 రోజుల పాటు కార్యక్రమాలు
- 9న రెండో విడత గొర్రెల పంపిణీ, 2,462 మందికి ఇళ్ల పట్టాలు
- కలెక్టర్ గౌతమ్ పర్యవేక్షణలో యంత్రాంగం సన్నద్ధం



వేడుకలకు కలెక్టరేట్‌లో పూర్తయిన ఏర్పాట్లు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలకు జిల్లా ముస్తాబైంది. శుక్రవారం నుంచి ఈనెల 22 వరకు నిర్వహించే అవతరణ సంబురాలకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. గత తొమ్మిదేళ్లలో చేసిన అభివృద్ధిని కళ్లకు కట్టినట్లు వివరించడంతో పాటు సంక్షేమ పథకాల మలివిడత అమలుకు కలెక్టర్ వీ.పీ.గౌతమ్ పర్యవేక్షణలో అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. కాగా, శుక్రవారం రాష్ట్ర అవతరణ వేడుకల కోసం కలెక్టరేట్‌ను రంగురంగుల లైట్లతో ముస్తాబు చేశారు. తొలుత ఖమ్మంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేశాక పెవిలియన్ గ్రౌండ్‌లో అమరవీరుల స్తూపానికి నివాళులర్పిస్తారు. ఆ తర్వాత కలెక్టరేట్‌లోనే రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించాక పోలీసు బలగాల నుంచి గౌరవవందనం స్వీకరించనున్నారు.

రైతు వేదికల్లో అవతరణ పండుగ..

జిల్లావ్యాప్తంగా ఉన్న 129 రైతువేదికల్లో రాష్ట్ర అవతరణ పండుగను జరపనున్నారు. సుమారు 1.30 లక్షల మంది రైతులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు. ఈనెల 3న జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా పంట కాలాన్ని ముందుకు తీసుకుపోవడం, విత్తనాల ఎంపిక తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించి సహపంక్తి భోజనాలు ఏర్పాటుచేస్తారు. అలాగే జిల్లాలో 461 గ్రామపంచాయతీల్లో కూడా అవతరణ ఉత్సవాలు జలవనరుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించి 1.65 లక్షల మందిని ఆహ్వానిస్తున్నారు. మిషన్ కాకతీయ, ప్రాజెక్టుల వివరాలను వెల్లడించి చెరువు కట్టలపై ఉన్న దేవతలను పూజించాక కోలాటాలు, బతుకమ్మ ఆడనున్నారు.

రెండో దశ గొర్రెల పంపిణీ

రాష్ట్ర అవతరణ ఉత్సవాల సందర్భంగా రెండో దశ గొర్రెల పంపిణీ మొదలుపెడతారు. ఈనెల 9న నియోజకవర్గ కేంద్రాల్లో ఆరుగురు చొప్పున లబ్ధిదారులకు యూనిట్లు అందజేయనున్నారు. ఆ తర్వాత ఎంపికైన 16 వేల మంది లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు. ఇక బీసీలకు రూ.లక్ష ఆర్థిక సాయానికి సంబంధించి జిల్లాలో 8,400 మందిని అర్హులను గుర్తించగా ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అవతరణ ఉత్సవాల్లోనే సాయం అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే, కొత్తగా ఏర్పడిన గ్రామపంచాయతీల భవనాలకు శంకుస్థాపన చేస్తారు.

ఇళ్ల స్థలాలకు 58 ఎకరాలు

నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు గతంలో ప్రభుత్వం 50 గ్రామపంచాయతీల్లో 58 ఎకరాలను సేకరించింది. ఆతర్వాత పంపిణీ వివిధ కారణాలతో నిలిచిపోగా అవతరణ ఉత్సవాల సందర్భంగా నిరుపేదలకు పంచనున్నారు. దరఖాస్తుల ప్రక్రియ శుక్రవారంతో ముగియనుంది. మొత్తంగా 2,462 మందికి 75 గజాల చొప్పున ఈనెల 9న ఇళ్ల పట్టాల పంపిణీ జరగనుంది. అలాగే ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గర్భిణులకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ, హరితోత్సవంతో లక్షకు పైగా మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేపడుతారు.

ప్రగతిని ప్రతిబింబించేలా..



గత తొమ్మిదేళ్లలో ప్రభుత్వం జిల్లాలో చేసిన ప్రగతి ప్రతిబింబించేలా రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తాం. జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించడంతోపాటు అర్హులైన వారికి లబ్ధి చేకూర్చేలా కార్యక్రమాలు చేపట్టాం. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం అంతా ఈ కార్యక్రమాల్లో మమేకమయ్యేలా ప్రణాళిక రూపొందించాం. శుక్రవారం నుంచి 21 రోజుల పాటు పట్టణం నుంచి పల్లె వరకు పండుగ వాతావరణంతో రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు జరుగుతాయి. ప్రభుత్వం ఇప్పటి వరకు చేసిన ప్రగతి.. చేయబోయే అభివృద్ధికి అవతరణ ఉత్సవాలు వేదికలవుతాయి.

– వీ.పీ.గౌతమ్, కలెక్టర్

గడప గడపకూ కమలం..

- అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తాం
- జమ్మూకాశ్మీర్ మాజీ డిప్యూటీ సీఎం నిర్మల్ సింగ్



మాట్లాడుతున్న జమ్మూకాశ్మీర్ మాజీ డిప్యూటీ సీఎం నిర్మల్‌సింగ్, పక్కన నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: మహాజన సంపర్క్ అభియాన్‌లో భాగంగా ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంపై ఈనెల 30 వరకు కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు గడప గడపకు కమలం పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు జమ్మూకాశ్మీర్ మాజీ డిప్యూటీ సీఎం డాక్టర్ నిర్మల్ సింగ్ తెలిపారు. జిల్లా కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మోదీ సారథ్యాన జమ్మూకాశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దు చేయడంతో ప్రజలు సుఖశాంతులతో ఉన్నారని, దీంతో పాటు ఇతర పథకాలను ఇంటింటికీ తిరిగి వివరిస్తామన్నారు. కాగా, నీళ్లు, నిధులు, నియామకాల ప్రాతిపదికన 1,200 మంది బలిదానాలతో సాధించుకున్న తెలంగాణలో ప్రజలకు లబ్ధి జరగకపోగా నిరుద్యోగం పెరిగిందని, కేసీఆర్ కుటుంబానికి మాత్రమే పదవులు దక్కాయని ఆరోపించారు. బీజేపీ కుటుంబపాలనకు వ్యతిరేకమని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర మంత్రివర్గంలో 60 శాతం బడుగు, బలహీనవర్గాల వారే ఉన్నారని, తెలంగాణలో ఎందరు బడుగు, బలహీనవర్గాలకు పదవులు ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. తప్పు చేసిన వారెవరైనా శిక్ష అనుభవించక తప్పదని, ఇందులో ఎమ్మెల్సీ కవిత కూడా అతీతురాలు కాదని తెలిపారు. రూ.12 వేల కోట్లతో ఖమ్మం జిల్లాలో జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయని చెప్పారు.

చరిత్ర సృష్టించిన మోదీ

నేలకొండపల్లి/బోనకల్: ప్రధాని మోదీ తొమ్మిదేళ్లలో అభివృద్ధి విషయమై చరిత్ర సృష్టించారని జమ్మూకాశ్మీర్ మాజీ డిప్యూటీ సీఎం డాక్టర్ నిర్మల్ సింగ్ అన్నారు. నేలకొండపల్లి మండలంలోని పైనంపల్లి వద్ద జరుగుతున్న జాతీయ రహదారి నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రతీ గ్రామంలో అభివృద్ధి జరిగిందంటే మోదీ వల్లేనని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ తమిళనాడు సహ ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ కబంధ హస్తాల నుంచి తెలంగాణను కాపాడుకోవాల్సిన అవసరముందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని తెలిపారు. అనంతరం మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బోనకల్ మండలం రావినూతలలో పర్యటించిన నిర్మల్‌సింగ్ మాట్లాడుతూ దేశాన్ని ప్రగతిపథంలో నిలిపే శక్తి బీజేపీకి మాత్రమే ఉందని తెలిపారు. ఖమ్మం జిల్లాలోని మారుమూల ప్రాంతాలకు కూడా జాతీయ రహదారులను విస్తరించడం గర్వకారణంగా ఉందని చెప్పారు. జమ్మూకాశ్మీర్ సాధనలో తాను కూడా లాఠీదెబ్బలు తిన్నానని, కుటుంబసభ్యులను పోగొట్టుకున్నానని గుర్తుచేశారు. అయినా దేశం కోసం తన కుటుంబం ప్రాణాలు అర్పించడం గర్వంగా ఉందని తెలిపారు. బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు, దళితనేత తాళ్లూరి సురేష్ నివాసంలో అల్పాహారం స్వీకరించిన ఆయన నూతన దంపతులైన లక్ష్మణ్–ప్రియను ఆశీర్వదించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, నాయకులు గెంటెల విద్యాసాగర్, ఉప్పల శారద, రుద్ర ప్రదీప్, నున్నా రవికుమార్, కడకంచి రమేష్, నంబూరి రామలింగేశ్వరావు, అల్లిక అంజయ్య, మందా సరస్వతి, శ్రీదేవి, గుత్తా వెంకటేశ్వర్లు, సుదర్శన్, అనంతు ఉపేందర్, మన్నె కృష్ణారావు, సూరేపల్లి జ్ఞానరత్నం, షర్ఫొద్దీన్, మోహినుద్దీన్, కె.హన్మంతరావు, బీ.పీ. నాయక్, వీరపనేని అప్పారావు, గుగులోతు నాగేశ్వరావు, కాలసాని పరుశురాం, ఏనుగు సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఆ కుటుంబానికి దిక్కెవరు?

- రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు సహా కుమారుడు మృతి
- చావుబతుకుల నడుమ కొట్టుమిట్టాడుతున్న మరో కుమారుడు
- కొణిజర్ల ప్రమాదంతో విప్పలమడకలో విషాద ఛాయలు



నుజ్జునుజ్జయిన కారులో మృతదేహాలు



మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు



మనవడి భౌతికాయం వద్ద రోదిస్తున్న బాబూరావు

వైరారూరల్/కొణిజర్ల: ఆ దంపతులకు ఒక్కగానొక్క కుమారుడు. పిల్లలు లేరని ఎందరు దేవుళ్లకు మొక్కారో.. ఎన్ని పూజలు చేశారో కానీ దేవుడు కరుణించి వివాహం జరిగాక 13 ఏళ్లకు కుమారుడు జన్మించాడు. వ్యవసాయ పనులు, పాల వ్యాపారం చేస్తూ ఆయనను ఎంబీఏ వరకు చదివించగా ఉద్యోగం చేస్తూ తల్లిదండ్రులకు అండగా నిలుస్తున్నాడు. ఈనేపథ్యాన ఉద్యోగంలో ప్రతిభతో కంపెనీ ప్రకటించిన ప్రోత్సాహక నగదుతో తల్లిదండ్రులు, భార్యాబిడ్డలతో తిరుపతి వెళ్లాలని నిర్ణయించుకున్న ఆయన స్వగ్రామానికి వస్తుండగా కొణిజర్ల వద్ద లారీ రూపంలో మృత్యువు బలి తీసుకుంది. ఈ ఘటనలో భార్యాభర్తలు సహా కుమారుడు మృతి చెందగా.. మరో కుమారుడు గాయపడ్డాడు. దీంతో కుమారుడు, కోడలు, మనవడిని కోల్పోయిన వృద్ధ దంపతులు విలపించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

అంచెలంచెలుగా ఉన్నత స్థాయికి..

వైరా మండలం విప్పలమడకకు చెందిన పారుపల్లి బాబూరావు, సరోజిని దంపతులకు వివాహం జరిగాక పదమూడేళ్లకు రాజేష్(34) జన్మించారు. రాజేష్‌ను అల్లారుమద్దుగా చూసుకున్న తల్లిదండ్రులు ఎంబీఏ వరకు చదివించగా ఆయన 2008లో హైదరాబాద్‌లోని లారెస్ ఫార్మా కంపెనీలో ట్రెయినీగా చేరి అకౌంట్స్ మేనేజర్ స్థాయికి ఎదిగాడు. ఇక రాజేష్‌కు సుజాత(34)తో వివాహం జరగగా వీరికి కుమారులు దివిజిత్ శ్రీరామ్, అశ్విత్ శ్రీరామ్(13) ఉన్నారు. రాజేష్ భార్య కూడా లారెస్ ఫార్మాలోనే విధులు నిర్వర్తిస్తుండగా హైదరాబాద్‌లో పిల్లలను చదివిస్తూ నివాసముంటున్నారు. రాజేష్ లారెస్ ఫార్మాలో పదిహేనేళ్లగా పనిచేస్తుండడంతో మే 26న సీఈఓ చావా సత్యనారాయణ రూ.3.75 లక్షల నగదు రివార్డు అందజేశారు. దీనికి తోడు పిల్లలకు వేసవి సెలవులు ముగియనుండడంతో స్వగ్రామానికి వచ్చి తల్లిదండ్రులతో సహా తిరుమల వెళ్లాలని నిర్ణయించుకుని కారులో బుధవారం రాత్రి విప్పలమడక బయలుదేరారు. కాగా, కొణిజర్ల పోలీసుస్టేషన్ సమీపాన ట్యాంకర్ మరమ్మతుకు గురై రోడ్డుపై ఆగిపోవడంతో ఆ వెనుక మరో లారీ ఆగింది. దీంతో రాజేష్ కూడా తమ కారును లారీ వెనక నిలపగా... అతివేగంగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో రెండు లారీల నడుమ కారు నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో రాజేష్, సుజాత, అశ్విత్ అక్కడికక్కడే మృతి చెందగా దివిజిత్ తీవ్రంగా గాయపడ్డాడు.

సెలవు ముందుకు జరుపుకుని..

హైదరాబాద్ నుంచి బయలుదేరే సమయాన రాజేష్ తండ్రి బాబూరావుకు ఫోన్ చేసి తెల్లవారేకల్లా విప్పలమడక వస్తామని చెప్పారు. ఇంకో అర గంటలో ఇంటికి చేరతామనగా గురువారం తెల్లవారుజామున 4.30 గంటలకు ప్రమాదం బారిన పడ్డారు. రాజేష్ తొలుత ఈనెల 2, 3వ తేదీల్లో మాత్రమే సెలవు పెట్టాడు. కానీ తల్లిదండ్రులతో ఇంకో రోజు గడపొచ్చని గురువారం కూడా సెలవు తీసుకుని విప్పలమడక వస్తుండగా ప్రమాదం జరిగింది. అప్పటికప్పుడు సెలవు పెట్టకున్నా ఈ ఘోరం జరిగి ఉండేది కాదని బంధువులు రోదించిన తీరు అందరినీ కంట తడి పెట్టించింది. కాగా, ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దివిజిత్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మిగిలిన ముగ్గురు మృతదేహాలను పోస్టుమార్టం అనంతరం స్వగ్రామానికి తరలించిన అంత్యక్రియలు పూర్తిచేశారు. ఒక్కగానొక్క కొడుకును కోల్పోయిన రాజేష్ తల్లిదండ్రుల రోదనలను ఆపడం ఎవరి తరం కాలేదు. మృతుల కుటుంబాన్ని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావుతో పాటు వివిధ పార్టీల నాయకులు మాలోతు రాందాస్‌నాయక్, బానోతు విజయబాయి, జాన్‌పాపయ్య, ఫార్మా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ జగన్‌మోహన్‌రావు, ఉద్యోగులు కొమ్మినేని సతీష్, రాఘువ పరామర్శించారు.

రెండు గంటల తర్వాత చేరుకున్న పోలీసులు..

ఖమ్మం-దేవరపల్లి జాతీయ ప్రధాన రహదారిపై ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ఈక్రమంలోనే కొణిజర్ల పోలీసుస్టేషన్ సమీపాన ఒక ట్యాంకర్ రాత్రంతా నిలిపేసినా పక్కకు తొలగించడంపై ఎవరూ శ్రద్ధ వహించలేదు. దీంతో రాజేష్ కుటుంబం ప్రమాదం బారిన పడిందని చెబుతున్నారు. ఇక తెల్లవారుజామున 4.30 గంటలకు ప్రమాదం జరిగితే పోలీసులు స్పందించలేదు. స్థానికులు, వాహనదారులు కారులో ఇరుక్కుపోయి ఉన్న మృతదేహాలను బయటకు తీశారు. ఇదంతా పూర్తయ్యే సరికి రెండు గంటలు పట్టింది. అప్పటికి కూడా పోలీసులు రాకపోవడంతో స్థానికులు డయల్ 100కు సమాచారం ఇవ్వగా ఏసీపీ ఎం.ఏ రెహమాన్, సీఐ తాటిపాముల సురేష్, ఎస్సై శంకర్ చేరుకుని మృతదేహాలను ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

క్లుప్తంగా

దేశానికే ఆదర్శంగా తెలంగాణ

● రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది అవతరణ దినోత్సవాల సందర్భంగా ప్రజలకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. అనేక పోరాటాలు, బలిదానాలతో సాధించుకున్న తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతోందని చెప్పారు. ఉద్యమ కాలం నాటి నినాదాలను ఒక్కటొక్కటిగా అమలుచేస్తున్న ప్రభుత్వం.. దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు.

ఎంపీ రవిచంద్ర శుభాకాంక్షలు

రాష్ట్రావతరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ వాసులకు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. నేటి సీఎం, నాటి ఉద్యమనేత కేసీఆర్ నేతృత్వాన సాధించుకున్న తెలంగాణను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. కొద్ది నెలల్లో జరగనున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధించడం, కేసీఆర్ మూడో సారి ముఖ్యమంత్రి కావడం తథ్యమని ఎంపీ తెలిపారు.

బ్రిస్బేన్ సదస్సుకు మమత వైద్యుడు ఎంపిక



సహచర వైద్యులతో సంతోష్‌కుమార్

ఖమ్మంఅర్బన్: ఆస్ట్రేలియాలో అంతర్జాతీయ స్థాయిలో లైనస్ కమిటీ ఆధ్వర్యాన జరిగే బ్రిస్బేన్ సదస్సుకు ఖమ్మంలోని మమత వైద్య కళాశాల వైద్యుడు డాక్టర్ కె.సంతోష్‌కుమార్ ఎంపికయ్యారు. మూడు రోజుల పాటు జరిగే సదస్సులో పాల్గొనే అవకాశం లభించడంపై మమత వైద్య సంస్థల ఫౌండర్ పువ్వాడ నాగేశ్వరరావు, చైర్మన్ పువ్వాడ అజయ్‌కుమార్, సెక్రటరీ పువ్వాడ జయశ్రీ, డాక్టర్ నరేన్, డీన్, ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్, సూపరింటెండెంట్ రామస్వామి హర్షం వ్యక్తం చేశారు. కాగా, అమెరికన్ హార్ట్ ఆఫ్ అసోసియేషన్, యూరోపియన్ పునరుజ్జీవ మండలి, హార్ట్ అండ్ స్ట్రోక్ ఫౌండేషన్ ఆఫ్ కెనడా తదితర సంస్థల బాధ్యులు ఈ సదస్సులో పాల్గొని వివిధ అంశాలపై చర్చించనున్నారని సంతోష్ తెలిపారు.

ఐడీఓసీలో పరస్పరం ఘర్షణ

ఖమ్మం సహకారనగర్: జిల్లా ఉన్నతాధికారులను కలిసేందుకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(ఐడీఓసీ)కి పలువురు వ్యక్తులు పరస్పరం దాడులు చేసుకున్నారు. కలెక్టరేట్‌కు గురువారం వచ్చి ఓ ఉన్నతాధికారిని కలిసిన పలువురు మరో అధికారిని కలిసేందుకు సమావేశ మందిరం వద్ద వేచి ఉన్నారు. ఈక్రమంలో మాటామాట పెరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. దీంతో అక్కడ ఉన్న వారు సముదాయించి బయటకు పంపించారు.

ఇంటికి తాళం వేసిన వారిపై కేసు

కారేపల్లి: ఇంటికి తాళం వేసిన వ్యక్తులపై కారేపల్లి పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ పి.రామారావు తెలిపిన వివరాల ప్రకారం... చీమలపాడుకు చెందిన భాగం సత్యనారాయణ, అదే గ్రామానికి చెందిన భాగం రాంబాబు మధ్య ఆర్థిక లావాదేవీలపై వివాదం కొనసాగుతోంది. ఇదిలా ఉండగా భాగం సత్యనారాయణ కారేపల్లిలో పదేళ్లుగా నివాసముంటూ చీమలపాడులోని ఇంటిని రామగిరి వెంకటేశ్వర్లుకు అద్దెకు ఇచ్చాడు. అయితే, గురువారం రాంబాబు, కుటుంబసభ్యులు వెంకటేశ్వర్లును బయటకు గెంటేసి ఇంటికి తాళం వేశారు. ఘటనపై ఆయన ఫిర్యాదుతో రాంబాబు, మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కత్తితో వ్యక్తి హల్‌చల్



స్థానికులు బంధించిన వ్యక్తి

ఖమ్మంక్రైం: ఖమ్మం మయూరిసెంటర్‌లో బుధవారం అర్ధరాత్రి ఓ కత్తితో హల్‌చల్ చేశాడు. గుర్తుతెలియని వ్యక్తి మద్యం సేవించి తన వద్ద ఉన్న కత్తితో దారిన వచ్చివెళ్లే వారికి దాడికి యత్నిస్తూ దూషించాడు. దీంతో స్థానికులకు ఆయనకు దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం ఇవ్వగా సిబ్బంది చేరుకుని కత్తి స్వాధీనం చేసుకున్నారు. అలాగే, సదరు వ్యక్తి వివరాలు ఆరా తీస్తున్నారు.

అద్దె చెల్లించలేదని అంగన్ వాడీ సెంటర్‌కు తాళం

కొత్తగూడెంటౌన్: అద్దె చెల్లించలేదని అంగన్ వాడీ సెంటర్‌కు గది అద్దె ఇచ్చిన యజమాని తాళం వేసిన సంఘటన పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా.. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని కూలీలైన్‌లో ఉన్న అంగన్‌వాడీ సెంటర్-10కు కొన్ని నెలలుగా అద్దె చెల్లించడం లేదు. దీంతో యజమాని గురువారం ఉదయం తాళం వేయగా అంగన్‌వాడీ టీచర్ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు వారు యజమానితో మాట్లాడి.. అద్దె చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో తాళం తీశాడు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,205

'బడిబాట'కు సన్నద్ధం!

● రేపటి నుంచి 17 వరకు కార్యక్రమాలు
● బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించడమే లక్ష్యం



జలగంనగర్‌లోని జెడ్పీఎస్ఎస్‌లో జరిగిన సన్నాహక సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడమే ప్రధాన లక్ష్యంగా ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ఈ నెల 3వ తేదీ నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇప్పటికే అందిన ఉత్తర్వులతో విద్యాశాఖ అధికారులు ప్రణాళిక రూపొందించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు - మన బడి ద్వారా దీటుగా సౌకర్యాలు కల్పించటంతో పాటు ఉచిత ఇంగ్లిష్ మీడియం విద్య అందిస్తోంది. అలాగే, మధ్యాహ్న భోజనం, ఉచిత యూనిఫాం, పుస్తకాలు అందిస్తున్నారు. ఈ విషయాలను వివరిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించేలా ఉపాధ్యాయులు బడిబాట ద్వారా అవగాహన కల్పించనున్నారు.

కార్యక్రమాలు ఇలా..

బడిబాట కార్యక్రమంలో భాగంగా బడి ఈడు పిల్లలను గుర్తించి సమీప పాఠశాలల్లో చేర్పించడంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు దాటిన వారికి కూడా పాఠశాలల్లో చేర్పిస్తారు. తక్కువ విద్యార్థుల నమోదు ఉన్న పాఠశాలల్లో ప్రత్యేక ప్రణాళిక ద్వారా తల్లిదండ్రుల భాగస్వామ్యంతో సంఖ్య పెంపునకు కృషి చేస్తారు. ఇందులో భాగంగా 3 నుంచి 9వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 7నుంచి 11 గంటల వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ర్యాలీలు నిర్వహించి ఇంటింటి ప్రచారం చేస్తారు. మన ఊరు -మన బడి కార్యక్రమం ద్వారా సమకూరిన వసతులపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమన్వయంతో అంగన్‌వాడీ కేంద్రాల్లోని అర్హులైన పిల్లలతో పాటు మహిళా స్వయం సహాయక బృందాల సాయంతో పాఠశాల వయస్సు, బడి బయట ఉన్న పిల్లలు, బాల కార్మికులు, ఎక్కువ కాలం గైర్హాజరైన వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తారు. ఇంకా ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను పాఠశాలలు, భవిత కేంద్రాలో చేర్పించడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నారు. అలాగే, పాఠశాలలు పునఃప్రారంభమయ్యాక 12వ తేదీన మన ఊరు-మన బడి కార్యక్రమాల ప్రత్యేకతను వివరించడం, 13న తొలి మెట్టులో భాగంగా విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను మెరుగుపర్చడం, 14న సామూహిక అక్షరభ్యాసం, 15న ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల నమోదు, 16న పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంపై అవగాహన కల్పించడంతో పాటు చివరి రోజైన 17న పాఠశాలల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

పకడ్బందీగా బడిబాట

బడిబాట కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేలా అధికారులు, ఉపాధ్యాయులు సిద్ధమయ్యారు. గతేడాది ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 15వేల మంది వరకు విద్యార్థులను బడిబాటలో భాగంగా చేర్పించారు. అయితే, వీరిలో సుమారు 7వేల మంది డ్రాపౌట్ అయ్యారు. ఈసారి అలా జరగకుండా యంత్రాంగం దృష్టి సారించనుంది. ఈమేరకు గురువారం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించి సమీక్షించారు.

ప్రవేశాలు పెంచడమే లక్ష్యం



గత ఏడాది కంటే పది శాతం మంది విద్యార్థులను పెంచడమే లక్ష్యంగా కృషి చేయనున్నాం. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో మన ఊరు - మన బడి ద్వారా మౌలిక వసతులు కల్పించింది. అలాగే, ఇంగ్లిష్ మీడియం సైతం అందుబాటులోకి వచ్చింది. ఈ నేపథ్యాన బడి బాట ద్వారా పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తాం.
– సోమశేఖరశర్మ, జిల్లా విద్యాశాఖాధికారి

దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ గౌతమ్



ఉత్సవాల వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ గౌతమ్, అధికారులు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో శుక్రవారం నుంచి 21 రోజుల పాటు జరిగే తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేలా అధికారులు సిద్ధం కావాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్ నుంచి గురువారం ఆయన మండల ప్రత్యేకాధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, మండల వ్యవసాయ అధికారులతో వీసీ ద్వారా మీక్షించారు. అన్ని శాఖల అధికారులు ప్రజాప్రతినిధుల సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ఇందులో భాగంగా 3వ తేదీన జరిగే రైతు దినోత్సవం తదితర కార్యక్రమాలపై అవగాహన కల్పించారు.

ఇళ్ల స్థలాల పంపిణీకి ఏర్పాట్లు

జిల్లాలో గుర్తించిన భూమిలో అర్హులైన నిరుపేదలకు 75 గజాల చొప్పున ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ గౌతమ్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి ఆయన ఆర్డీఓలు, తహసీల్దార్లతో వీసీ ద్వారా మాట్లాడుతూ అర్హుల జాబితా ఆధారంగా పట్టాలు సిద్ధం చేయాలని తెలిపారు. ఈనెల 9న పట్టాలు పంపిణీ చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఈసమావేశాల్లో అదనపు కలెక్టర్లు స్నేహలత, మధుసూదన్, అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్, డీఆర్వో శిరీష, జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, డీపీఓ విజయనిర్మల, ఏడీఏ సరిత, ఆర్డీఓ సూర్యనారాయణ, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్‌తో పాటు రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్, పీఎస్ భవనాల పరిశీలన



రఘునాథపాలెంలో కార్యాలయ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్, సీపీ వారియర్

రఘునాథపాలెం: రఘునాథపాలెంలో తహసీల్దార్ కార్యాలయం, పోలీసుస్టేషన్ భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. వీటిని తెలంగాణ ఆవిర్భావ సంబరాల్లో భాగంగా ఈనెల 10న ప్రారంభించాలని నిర్ణయించారు. ఈమేరకు కలెక్టర్ వీ.పీ.గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్ గురువారం సాయంత్రం పరిశీలించి మిగులు పనులు పూర్తిచేసేలా అధికారులకు సూచనలు చేశారు. పీఆర్ ఈఈ శ్రీనివాసరావు, ఏఈ ఆదిత్యరాజు, ఎంపీడీఓ రామకృష్ణ, తహసీల్దార్ నర్సింహారావు, ఎస్ఐ రవి పాల్గొన్నారు.

వైభవంగా గాలిగోపురం ప్రతిష్ఠ



ఆలయానికి చేస్తున్న ఎంపీ వద్దిరాజు తదితరులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం ఎన్నెస్పీ కాలనీ లోని సీతారామాంజనేయ స్వామి దేవస్థానం గాలి గోపురం ప్రతిష్ఠాపన గురువారం వైభవంగా జరిగింది. వేదపండితులు, అర్చకుల మంత్రోచ్ఛరణల నడుమ జరిగిన పూజల్లో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర -విజయలక్ష్మి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా గాలిగోపురంతో పాటు ప్రతిష్ఠాపన జరిగిన లక్ష్మీదేవి, ఆండాలు, గోదాదేవి, జయవిజయ అమ్మవార్లు, సీతారామచంద్ర స్వామి, ఆంజనేయ స్వామి వార్లను దర్శించుకున్నారు. భక్తమండలి చైర్మన్ మోత్కూరి మురళీధర్ రావు, పూజారి వెంకటరమణాచార్యులు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్పొరేటర్ శ్రీవిద్య, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణంతో పాటు ఆకుల గాంధీ, పారా నాగేశ్వరరావు, శెట్టి రంగారావు, ఆకుతోట ఆదినారాయణ, శీలంశెట్టి వీరభద్రం పాల్గొన్నారు.

తెలంగాణ, బిహార్ జట్ల విజయం



67 పరుగులు చేసిన అంజలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఏసీపీ రామోజీ రమేష్

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఆల్ ఇండియా మహిళా టీ-20 క్రికెట్ టోర్నీ కొనసాగుతోంది. ఈమేరకు మూడో రోజైన గురువారం జరిగిన మ్యాచ్‌ల్లో తెలంగాణ, బిహార్ జట్లు విజయం సాధించాయి. తొలి మ్యాచ్‌లో తెలంగాణ-జమ్మూకాశ్మీర్ జట్లు తలపడగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న తెలంగాణ జట్టు 20 ఓవర్లలో 176 పరుగుల భారీ స్కోరు చేసింది. జట్టులో అంజలి 67, నవీన 37, దివ్య 27 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన జమ్మూకాశ్మీర్ జట్టు 15.2 ఓవర్లలో 98 పరుగులకే ఆలౌట్ అయింది. తెలంగాణ బౌలర్లలో అనిత 2, నవీన ఒక వికెట్ పడగొట్టారు. అనంతరం ఫ్లడ్ లైట్ల వెలుతురులో బిహార్-కర్ణాటక జట్ల మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న బిహార్ జట్టు కేవలం రెండు వికెట్లే కోల్పోయి 136 పరుగులు చేసింది. ఈ జట్టులో విశాలక్ష్మి 9 ఫోర్లతో 61 పరుగులు చేయగా నిషీత 34, స్వర్ణిమ చక్రబర్తి 18 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన కర్ణాటక లక్ష్యాన్ని చేధించకుండానే ఆలౌట్ అయింది. మ్యాచ్‌లను ట్రాఫిక్ ఏసీపీ రామోజీ రమేష్ ప్రారంభించగా.. అథ్లెటిక్స్ కోచ్ ఎం.డీ.గౌస్, సీఐలు అంజలి, అశోక్, మహిళా క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.డీ.మతిన్, సీనియర్ క్రికెటర్ ఖయ్యూం పాల్గొన్నారు.

అంబేద్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాల ఆవిష్కరణ



గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో మంద కృష్ణ, నాయకులు

మధిర: మండలంలోని ఇల్లూరులో ఏర్పాటుచేసిన అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలను గురువారం ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ ఈ విగ్రహాలను ఆవిష్కరించగా తొలుత గ్రామంలో నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మంద కృష్ణ మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాలకు రిజర్వేషన్ ఫలాలు దక్కేలా కృషి చేసిన అంబేద్కర్ ఎల్లకాలం ప్రజల గుండెల్లో నిలిచి ఉంటారని తెలిపారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ కోట రామారావు, నాయకులు కోట రాంబాబు, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు పలువురు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో నలుగురికి గాయాలు

కల్లూరు రూరల్: కల్లూరు మండలం చెన్నూరులో గురువారం వీధికుక్కల దాడిలో నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటనలో నూతలపాటి సత్యం, పాపారావు, రంగయ్య, రాములు గాయపడగా పభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించారు.

క్షమాపణతో ముగిసిన వివాదం



ఆందోళన నిర్వహిస్తున్న శానిటేషన్ వర్కర్లు

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బండ్ల రాధాకృష్ణపై మాజీ కౌన్సిలర్ యలమందల వాసు దౌర్జన్యం చేసిన సంఘటనపై శానిటరీ వర్కర్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు మద్దతుగా గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఈనేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ అంకుషావలీ జోక్యం చేసుకుని కార్మికులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, వాసుతో చర్చించారు. అనంతరం కార్మికులు, మున్సిపల్ అధికారుల సమక్షంలో రాధాకృష్ణకు వాసు క్షమాపణలు తెలిపారు. ఆ తర్వాత మున్సిపల్ వర్కర్లు ఆందోళన విరమించినప్పటికీ విధులకు మాత్రం హాజరు కాలేదు.

ఆరా తీసిన కలెక్టర్ అనుదీప్..

ఇల్లెందు మున్సిపాలిటీలో జరిగిన వివాదంపై కలెక్టర్ అనుదీప్ మున్సిపల్ కమిషనర్ అంకుషావలీకి ఫోన్ చేసి ఆరా తీశారు. ఈమేరకు సంఘటనకు దారి తీసిన పరిస్థితులను తెలుసుకున్న ఆయన మరికొన్ని అంశాలపై కూడా చర్చించారు.

అంకితభావంతో పనిచేసే నాయకులు కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

మాజీ ఎంపీ బలరాం, డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్

కామేపల్లి(కారేపల్లి): కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేసే నాయకులను తయారుచేయడమే ఎల్‌డీఎం(లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ మిషన్) ఉద్దేశమని మాజీ ఎంపీ పోరిక బలరాంనాయక్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. ఇల్లెందు నియోజక వర్గ ఎల్‌డీఎం కోఆర్డినేటర్ చకిలం రాజేశ్వరరావు, కామేపల్లి మండల అధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి అధ్యక్షతన కామేపల్లిలో గురువారం జరిగిన ఎల్‌డీఎం సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామస్థాయిలో కాంగ్రెస్ పటిష్ఠంగా ఉన్నందున రానున్న ఎన్నికల్లో ఇల్లెందు నుంచి విజయం సాధించేలా కృషి చేయాలని సూచించారు. ఈక్రమంలో నాయకత్వ లక్షణాలు ఉన్న యువతరానికి ప్రాధాన్యత ఇస్తూ, పార్టీ బలోపేతానికి పాటుపడాలని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, బానోతు వెంకటప్రవీణ్‌కుమార్ నాయక్, బొడ్డు బొందయ్య, పుచ్చకాయల వీరభద్రం, తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో పట్టువస్త్రాలు మాయం?

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో సిబ్బంది మరో గోల్‌మాల్‌కు పాల్పడినట్లుగా తెలుస్తోంది. స్వామి వారికి శ్రీరామనవమి సందర్భంగా పలు సంస్థలు, ప్రముఖులు, భక్తులు, దేవస్థానాల తరఫున సమర్పించిన పట్టు వస్త్రాలలో కొన్నింటిని సిబ్బంది గుట్టుచప్పుడు కాకుండా మాయం చేసినట్లు సమాచారం. వీటిని సమర్పించిన భక్తులు దేవస్థానానికి వచ్చి ఆరా తీయగా.. ఈ గోల్‌మాల్ బయల్పడినట్లుగా తెలుస్తోంది. దీంతో ఈఓ అంతర్గతంగా పట్టువస్త్రాల మాయంపై విచారణ చేస్తున్నట్లుగా సమాచారం. ఇదే రుజువైతే మరికొంత మంది ఉద్యోగులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

'ప్రసాద్' పనులకు శ్రీకారం



ఖాళీ స్థలంలో ముగ్గులు పోసిన దృశ్యం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రసాద్ పథకంలో భాగంగా భద్రాచలంలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు టూరిజం శాఖ అధికారులు గురువారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం, పర్ణశాల ఆలయాల్లో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు తొలివిడతగా రూ.42 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో మిథిలా స్టేడియం పక్కనే ఉన్న ఖాళీ స్థలం, ఆర్ అండ్‌బీకు చెందిన ఖాళీ స్థలంలో అధికారులు పలు వసతి గృహాల నిర్మాణానికి ముగ్గు పోశారు. ఇదిలా ఉండగా.. ప్రసాద్ పథకాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వర్చువల్ విధానంలో భద్రాచలంలో ప్రారంభించిన విషయం విదితమే.

ఉపాధి వేటలో ప్రాణాలు బలి

ఎదురెదురుగా రెండు లారీలు ఢీకొనడంతో డ్రైవర్లు మృతి



క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్

పెనుబల్లి: ఉపాధి నిమిత్తం లారీ డ్రైవర్లుగా పనిచేస్తున్న వారిద్దరు ప్రమాదంలో కన్నుమూశారు. ఎదురెదురుగా రెండు లారీలు ఢీకొనడంతో రెండు వాహనాల డ్రైవర్లు మృతి చెందిన ఘటన పెనుబల్లి మండలం వీఎం బంజర్ సప్తపది ఫంక్షన్ హాల్ ఎదుట బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఖమ్మం వైపు నుండి బియ్యం లోడ్‌తో సత్తుపల్లి వైపు వెళ్తున్న లారీ ఎదురుగా సత్తుపల్లి వైపు నుండి ఖమ్మం వైపు టీ పొడి లోడుతో వస్తున్న లారీని ఢీకొట్టింది. ఘటనా సమయాన లారీలు అతివేగంగా వెళ్తుండడంతో ముందు భాగం నుజ్జునుజ్జయి డ్రైవర్లు కేబిన్‌లో ఇరుక్కుపోయారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఒక క్రేన్, రెండు జేసీబీ సాయంతో రెండు గంటల పాటు శ్రమించి క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్లను బయటకు తీసేలోగా తీవ్ర గాయాల పాలైన వారిద్దరు మృతి చెందారు. ఒక లారీలో ఉన్న క్లీనర్ మాత్రం సురక్షితంగా బయటపడ్డాడు. కాగా, మృతులు మహారాష్ట్ర బలాసాకు చెందిన సంతోష్(55), బీహార్‌కు చెందిన ధర్మేంద్రకుమార్ యాదవ్(25)గా గుర్తించారు.

పని కోసం వెళ్తే ప్రాణం పోయింది..

● రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి



సాయితేజ (ఫైల్)

తల్లాడ: మండలంలోని రంగబంజర సమీపాన గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు మృతి చెందాడు. కల్లూరుకు చెందిన చింతపల్లి సాయితేజ(14) ఆర్థిక పరిస్థితులు బాగాలేక సెలవుల్లో తల్లాడ మండలం మల్లవరంలో డెకరేషన్ పనికి వెళ్లాడు. పని పూర్తయ్యాక ట్రాలీ ఆటోలో వెళ్తుండగా ఆటో పల్టీ కొట్టింది. ఘటనలో సాయితేజకు బలమైన గాయాలుకాగా కల్లూరు ఆస్పత్రికి తరలిస్తుండగానే మృతి చెందాడని ఎస్ఐ సురేష్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి



విజయ్ (ఫైల్)

ముదిగొండ: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని మేడేపల్లిలో గురువారం చోటు చేసుకుంది. మేడేపల్లికి చెందిన పగిళ్ల విజయ్(27) నేలకొండపల్లిలో ఓ పత్రికా విలేకరిగా పనిచేస్తుండగా, మే 29న ఇంటి నుంచి వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. దీంతో బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు 31న ముదిగొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇంతలోనే మేడేపల్లి సమీపాన మలబార్ తోటలో గురువారం ఉదయం ఓ చెట్టుకు ఉరి వేసుకున్న విజయ్ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి సమాచారం ఇచ్చారు. కాగా, అప్పటికే మృతదేహం కుళ్లిపోయి ఉండడంతో పోలీసుల సూచనతో అన్నం సేవా ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై మృతుడి తండ్రి నర్సయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్ఐ నరేష్ తెలిపారు. కాగా, విజయ్ ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

క్లుప్తంగా...

2.61 కోట్ల ప్రయాణికులు.. రూ.513.41 కోట్ల ఆదాయం

మే నెలలో రికార్డుస్థాయిలో దక్షిణ మధ్య రైల్వే ఆదాయం

సాక్షి, హైదరాబాద్: మే నెలలో ప్రయాణికుల రైళ్ల ద్వారా దక్షిణ మధ్య రైల్వే రికార్డు స్థాయి ఆదాయాన్ని నమోదు చేసుకుంది. దక్షిణ మధ్య రైల్వే చరిత్రలో ఒక నెలలో రూ.500 కోట్లకు మించి ఆదాయాన్ని పొందటం ఇదే తొలిసారి. ఈ ఏడాది ఏప్రిల్‌లో సాధించిన రూ.467.82 కోట్లు ఇప్పటివరకు గరిష్టంగా ఉండగా, తదుపరి నెలలోనే దాన్ని అధిగమించటం విశేషం. గతేడాది మే నెలలో 2.11 కోట్ల మంది ప్రయాణికులను తరలించింది. ఇప్పుడు అంతకంటే 24 శాతం ఎక్కువ మందిని గమ్యం చేర్చడం గమనార్హం. సాధారణ రైళ్లు కాకుండా వేసవి రద్దీ నేపథ్యంలో నడుపుతున్న స్పెషల్ రైళ్ల ద్వారా మే నెలలో 538 ట్రిప్పులను అదనంగా తిప్పి 4.65 లక్షల మందిని తరలించింది. తద్వారా అదనంగా రూ.36.52 కోట్ల ఆదాయం సంపాదించింది .

సరుకు రవాణాలో మరో రికార్డు..

ఇక సరుకు రవాణాలో కొంతకాలంగా తన రికార్డును తనే అధిగమిస్తూ వస్తున్న దక్షిణ మధ్య రైల్వే మే నెలలో కూడా ఆ పంథాను కొనసాగించింది. అంతకుముందు నెలతో పోలిస్తే 7 శాతం వృద్ధితో మేలో 12.517 మెట్రిక్ టన్నుల సరుకును రవాణా చేసి రూ. 1,213.36 కోట్లు ఆర్జించింది. గతేడాది మే నెల లో రూ. 1065.15 కోట్లు నమోదు చేసింది. అ త్యుత్తమ పనితీరు కనబరిచిన సంబంధిత విభాగాల అధికారులు, సిబ్బందికి దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ అభినందనలు తెలిపారు.

దశాబ్ది ఉత్సవాలు కాదు.. విషాదాలు

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్‌కౌశిక్‌యాదవ్ ఎద్దేవా



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై తొమ్మిదేళ్లు పూర్తి చేసుకుని పదో ఏడాదిలోకి అడుగు పెడుతున్న సందర్భంగా దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్, బీజేపీలు దశాబ్ది విషాదాల గురించి ఎందుకు మాట్లాడడం లేదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్ కౌశిక్ యాదవ్ ప్రశ్నించారు. తొమ్మిదేళ్ల పాలనలో రాష్ట్రంలో పది పెను విషాదాలు జరిగాయని గురువారం ఒక ప్రకటనలో ఆయన వెల్లడించారు. దళిత సీఎం, దళితులకు మూడెకరాల భూమి, ఇంటికో ఉద్యోగం, రూ.3,016 నిరుద్యోగ భృతి, రెండు లక్షల రుణమాఫీ తదితర అంశాల్లో రెండు పార్టీల నిర్లక్ష్యం కారణంగా తెలంగాణలో విషాదం నెలకొందని పేర్కొన్నారు.

మా కన్నీళ్లను తుడిచేదెవరు?

2003లో బీఆర్ఎస్ సభకు వెళ్లొస్తుండగా రోడ్డు ప్రమాదం

- ప్రాణాలు కోల్పోయిన నలుగురు కార్యకర్తలు
- వారి అంత్యక్రియల్లో పాల్గొన్న కీలక నేతలు
- బాధిత కుటుంబాలను ఆదుకుంటామని, ఉద్యోగాలు ఇస్తామని భరోసా.. ఇన్నేళ్లయినా తమను పట్టించుకోవడం లేదని కుటుంబాల ఆవేదన

సాక్షి, కామారెడ్డి: అప్పుడు పల్లెలన్నీ గులాబీ జెండా పట్టి జై తెలంగాణ అంటూ నినదించాయి. కరీంనగర్, వరంగల్, హైదరాబాద్.. ఎక్కడ సభలు పెట్టినా పుట్ల కొద్దీ జనం తరలివెళ్లేవారు. అలా 2003 జనవరి 6న హైదరాబాద్‌లో జరిగిన టీఆర్ఎస్ (ప్రస్తుతం బీఆర్ఎస్) సభకు రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో జనం తరలివెళ్లారు. అందులో కామారెడ్డి జిల్లా అన్నారం, రెడ్డిపేట గ్రామాల నుంచి ఓ ప్రైవేటు బస్సులో వెళ్లినవారు తిరిగి వస్తుండగా.. జాతీయ రహదారిపై భిక్కనూరులో అర్ధరాత్రి సమయంలో బస్సు ప్రమాదానికి గురైంది. అన్నారం గ్రామానికి చెందిన కీసరి బాలమల్లు, మంగళారపు బాలరాజు, నెమిలి లక్ష్మణ్, భట్టు తండాకు చెందిన భట్టు లక్ష్మణ్ నలుగురు మృతిచెందగా, మరికొందరికి గాయాలయ్యాయి. మృతుల అంత్యక్రియల్లో బీఆర్ఎస్ అధినేత, ప్రస్తుత సీఎం కేసీఆర్ పాల్గొని నివాళులు అర్పించారు. అప్పుడు కామారెడ్డిలో ఉద్యమానికి నాయకత్వం వహించిన కొమ్ముల తిర్మల్‌రెడ్డి ద్వారా నాలుగు కుటుంబాలకు రూ.లక్ష చొప్పున సాయం అందించారు. తెలంగాణ వచ్చాక ఈ కుటుంబాలను ఆదుకుంటామని, ఉద్యోగాలిస్తామని కేసీఆర్ ప్రకటించారు. అయితే రాష్ట్రం వచ్చి తొమ్మిదేళ్లు అవుతున్నా.. తమను పట్టించుకునేవారు, తమ కన్నీళ్లు తుడిచేవారు లేరని బాధిత కుటుంబాలు వాపోతున్నాయి. ఉద్యమ సభకు వెళ్లొస్తూ ప్రమాదంలో చనిపోయిన తమ వారిని అమరుల జాబితాలో చేర్చి, ఆదుకోవాలని కోరుతున్నారు.

పేదరికంలో కుటుంబాలు

ప్రమాదంలో చనిపోయిన నాలుగు కుటుంబాలు పేదరికంతో తీవ్ర అవస్థల మధ్య జీవనం సాగిస్తున్నాయి. భర్తను కోల్పోయిన మహిళలు.. కుటుంబాన్ని పోషించే దిక్కు లేక, పిల్లలను పెంచి పెద్ద చేయడానికి నానా అవస్థలు పడ్డారు. ఇప్పటికీ కుటుంబాలు పేదరికంలోనే కొట్టుమిట్టాడుతున్నాయి. తమ కష్టాలు ఇప్పటికైనా తీరుతాయని, సీఎం కేసీఆర్ తమను ఆదుకుంటారన్న ఆశల్లోనే ఉన్నాయి. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలు జరుపుకొంటున్న సమయంలోనైనా తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నాయి.



కూలి చేస్తేనే పూటగడిచేది..

కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం అన్నారం గ్రామానికి చెందిన కీసరి బాలమల్లుకు భార్య బాలరాజవ్వ, ముగ్గురు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. బాలమల్లు మరణంతో కుటుంబ భారం నెత్తికెత్తుకున్న బాలరాజవ్వ.. కూలీనాలీ చేస్తూ పిల్లల్ని పెంచి పెద్ద చేసింది. ముగ్గురు కూతుళ్ల పెళ్లిళ్లు చేసింది. కొడుకు రాజు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. బాలరాజవ్వ కిడ్నీ సమస్యతో బాధపడుతోంది. అయినా కూలీపనులకు వెళితేనే పూట గడిచే పరిస్థితి.

కిరాణా దుకాణంతో నెట్టుకొస్తూ..



రామారెడ్డి మండలం బట్టుతండాకు చెందిన భట్టు లక్ష్మణ్‌కు భార్య రుక్మిణి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. లక్ష్మణ్ మరణంతో రుక్మిణి చిన్న హోటల్ నడుపుతూ పిల్లలను చదివించింది. కూతురు రాణి పెళ్లి చేసింది. కుమారుడు కృష్ణ ఇంటర్ దాకా చదివి ఇంటి వద్ద తల్లికి సాయంగా ఉంటున్నాడు. మరో కుమారుడు శోభన్‌బాబు హిందీ పండిత్ కోర్సు పూర్తిచేసి ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. తెలంగాణ వచ్చిన తర్వాత ఉద్యోగం, భూమి ఇస్తామని చెప్పిన సీఎం కేసీఆర్.. ఇప్పటికైనా తమను పట్టించుకోవాలని రుక్మిణి వేడుకుంటోంది.



అష్టకష్టాల్లో..

రామారెడ్డి మండలం అన్నారం గ్రామానికి చెందిన మంగళారపు బాలరాజుకు భార్య లక్ష్మి, కొడుకు ఉన్నారు. బాలరాజు చనిపోవడంతో లక్ష్మి చిన్నచిన్న పనులు చేస్తూ కొడుకును ఇంటర్ వరకు చదివించింది. కుమారుడు ఆటో నడుపుతుండగా, ఆమె హాస్టల్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. తెలంగాణ కోసం తపించిన తన భర్త చనిపోయాక రోడ్డున పడ్డామని లక్ష్మి ఆవేదన వ్యక్తం చేస్తోంది. తమ కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం, ఐదెకరాల భూమి ఇస్తామని చెప్పారని.. ఎందరిని కలిసి వేడుకున్నా ప్రయోజనం లేదని వాపోతోంది. ఇప్పటికైనా ఉద్యోగం ఇవ్వాలని వేడుకుంటోంది.

ప్రపంచంలోనే తొలిసారిగా.. 3D టెంపుల్

▶ మొదటి పేజీ తరువాయి

చతురస్రాకార, తామరపువ్వు ఆకారాల్లోని గర్భాలయాలతోపాటు ఆలయ గోపురాలను కంప్యూటర్‌లో తొలుత 3డీలో డిజైన్ చేసి ఆపై యంత్రాల ద్వారా నిర్మిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన నిర్మాణ సంస్థ అప్సుజా ఇన్‌ఫ్రాటెక్... త్రీడీ ప్రింటింగ్ నిర్మాణ సంస్థ అయిన సింప్లిఫోర్జ్ క్రియేషన్స్‌తో కలసి దీన్ని నిర్మిస్తోంది. పూర్తిగా ఆన్-సైట్ వద్దనే ముద్రించబడిన మోదక్, కమలం, ఆలయ గోపురం ఆకారపు నిర్మాణాలు తమ నిర్మాణ బృందానికి సవాళ్లుగా నిలిచాయని అప్సుజా ఇన్‌ఫ్రాటెక్ ఎండీ హరికృష్ణ జీడిపల్లి తెలిపారు. ఆలయ సూత్రాలకు అనుగుణంగా నిర్మాణ శైలి ఉండటంతోపాటు ఆర్కిటెక్చరల్‌గా వినూత్న పద్ధతుల్లో నిర్మిస్తున్న ఈ ఆలయం దేశంలోకెల్లా ప్రత్యేకంగా నిలుస్తుందన్నారు. ఇప్పటికే శివాలయం, మోదక్ ఆకార గర్భాలయం పూర్తి కావడంతో కమలం, పొడవైన గోపురాలతో కూడిన రెండవ దశ పనులను మొదలుపెట్టామని చెప్పారు. ఆలయ రూపకల్పన, 3డీ ప్రింటింగ్ సాంకేతికత, ఆన్‌సైట్ నిర్మాణంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నామని సింప్లిఫోర్జ్ క్రియేషన్స్ సీఈఓ ధ్రువ్ గాంధీ పేర్కొన్నారు. 10 రోజుల వ్యవధిలో కేవలం 6 గంటల్లోనే మోదక్ ఆకార నిర్మాణాన్ని ముద్రించామన్నారు. తామరపువ్వు ఆకారంలోని నిర్మాణాన్ని అంతకన్నా తక్కువ సమయంలోనే సిద్ధం చేయాలనుకుంటున్నట్లు చెప్పారు.



ప్రధాన ఆలయంతో పాటు పక్కన మరో ఆలయం నిర్మాణంలో ఉన్న దృశ్యం

ఇప్పటికే దేశంలోనే తొలి 3డీ నమూనా వంతెన

సింప్లిఫోర్జ్ క్రియేషన్స్ ఈ ఏడాది మార్చిలో ఐఐటీ హైదరాబాద్‌తో కలసి దేశంలోనే తొలి త్రీడీ ప్రింటెడ్ నమూనా వంతెనను నిర్మించింది. ఈ వంతెనను ప్రస్తుతం నిర్మిస్తున్న ఆలయం ఆవరణలో ఉన్న తోటలో పాదచారుల వంతెనగా ఉపయోగిస్తున్నట్లు ధ్రువ్ గాంధీ తెలిపారు. ప్రపంచంలోనే తొలిసారిగా 2022లో 3డీ ప్రింటింగ్ విధానంలో కాలిఫోర్నియాలోని టిహమా కౌంటీలో ఒక చర్చి నిర్మాణం జరిగిందన్నారు.

సూపర్‌ఫాస్ట్ రైల్వే లైన్లకు పచ్చ జెండా

ఆరు నెలల్లో సర్వే పూర్తిచేయాలని రైల్వేబోర్డు నిర్ణయం

విశాఖపట్నం–విజయవాడ–శంషాబాద్, విశాఖపట్నం –విజయవాడ–కర్నూలు మార్గాల సర్వేకు గ్రీన్ సిగ్నల్

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో మరో కీలక రైల్వే ప్రాజెక్టుకు బీజం పడింది. ఇరు రాష్ట్రాల అనుసంధానతను మరింత బలోపేతం చేసేందుకు రెండు కొత్త సూపర్ ఫాస్ట్ రైల్వే లైన్ల సర్వేకు రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం - విజయవాడ - తెలంగాణలోని శంషాబాద్ మధ్య మొదటిది, విశాఖపట్నం - విజయవాడ - కర్నూలు మార్గంలో రెండో రైల్వే లైన్ కోసం సర్వేకు రైల్వే బోర్డు అంగీకారం తెలుపుతూ.. దక్షిణ మధ్య రైల్వేకు లేఖ రాసింది. ఈ మార్గాల్లో సూపర్ ఫాస్ట్ రైల్వే ప్రాజెక్టు చేపట్టేందుకు అవసరమైన టెక్నికల్ ఫీజిబిలిటీని ఈ సర్వే ద్వారా నిర్ణయిస్తారు. సర్వే అయిన తర్వాత ప్రాజెక్టుపై ముందడుగు పడనుంది. ఈ రెండు రైల్వే లైన్లు కలిసి 942 కిలోమీటర్ల మార్గంలో (గరిష్టంగా 220 కేఎంపీహెచ్ వేగంతో ప్రయాణించేలా) రైల్వే లైన్ నిర్మాణానికి అవసరమైన సర్వే నిర్వహించనున్నారు. ఈ సర్వేను 6 నెలల్లో పూర్తిచేయనున్నారు. ఈ రైల్వే లైన్లకు సంబంధించి కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి పలుమార్లు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి లేఖలు సమర్పించారు. ఈ సూపర్‌ఫాస్ట్ రైల్వేలైన్ ద్వారా తెలుగు రాష్ట్రాలకు చేకూరే లబ్ధి గురించి వివరించారు. ఈ నేపథ్యంలో రైల్వే బోర్డు తాజాగా ఈ రెండు రూట్లలో సూపర్ ఫాస్ట్ రైల్వే లైన్ల సర్వేకు నిర్ణయం తీసుకుంది. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కేంద్రం ఈ నిర్ణయాన్ని వెల్లడించింది.

వర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయండి

సాక్షి, హైదరాబాద్: యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం సచివాలయంలో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కాంట్రాక్ట్ అధ్యాపకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులను ఏవిధంగా రెగ్యులరైజ్ చేయాలనే దానిపై నివేదిక తయారు చేయాలని అధికారులను మంత్రి సబిత ఆదేశించారని అధ్యాపకులు తెలిపారు.

జిల్లా వార్తలు

భద్రాద్రిలో 'నృసింహ సేవావాహిని'నిత్యాన్నదానం



భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేస్తున్న ఈఓ రమాదేవి

భద్రాచలంఅర్బన్: సుదూర ప్రాంతాల నుంచి భద్రాచలం రామయ్య దర్శనానికి వచ్చే భక్తుల కోసం శ్రీనృసింహ సేవా వాహిని ఆధ్వర్యాన గురువారం నిత్యాన్న ప్రసాద నిలయాన్ని ఏర్పాటు చేశారు. గురువారం ఈ నిత్యాన్న ప్రసాద నిలయాన్ని భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య, రామాలయం ఈఓ రమాదేవితో కలిసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నృసింహ సేవావాహిని చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. మన్యంలో సేవలందిస్తున్న వాహిని వ్యవస్థాపకులు డాక్టర్‌కృష్ణ చైతన్యను అభినందించారు. ఈ కార్యక్రమంలో కృష్ణచైతన్యతో పాటు శ్రీధర్, బోగాల శ్రీనివాసరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

సంబరాలు సరే.. ఆకాంక్షల మాటేమిటి?


- సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి రంగారావు



ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సంబరాలు నిర్వహించడం బాగున్నా, రాష్ట్రం కోసం పోరాడిన ప్రజల ఆశలు, ఆకాంక్షల మాటేమిటని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ప్రశ్నించారు. నిధులు, నీళ్లు, నియామకాలు, ఆత్మగౌరవం, స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం కోసం ప్రజలు పోరాడి రాష్ట్రాన్ని సాధించుకుంటే.. త్యాగాలు ఒకరివిగా, భోగాలు మరొకరివిగా పరిస్థితి మారిందని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగాలు భర్తీ చేయలేకపోగా, ప్రశ్నపత్రాల లీకేజీతో వ్యవస్థ అవినీతియమైందని తెలిపారు. పదేళ్ల తెలంగాణలో ఏ ఒక్కరికి ఇళ్ల స్థలాలు ఇవ్వకపోగా, డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకం పడకేసిందని, పోడు భూములకు పట్టాల పంపిణీలోనూ స్పష్టత లేదని ఆరోపించారు. అక్రమ అరెస్టులు, నిర్బంధం కాంగ్రెస్ హయాంలో కంటే ఎక్కువగా సాగుతున్నాయని విమర్శించారు. ఈమేరకు ప్రజాపంథా ఆధ్వర్యాన శుక్రవారం తెలంగాణ ఆకాంక్షలు, ఆశల దీక్షా దినంగా జరుపనున్నట్లు రంగారావు తెలిపారు.

సింగరేణిలో 102 శాతం ఉత్పత్తి

- ఏప్రిల్‌తోపోలిస్తే ఐదు శాతం అదనం
- కొత్తగూడెం రీజియన్‌లో అత్యధికంగా బొగ్గు వెలికితీత



సత్తుపల్లి జేవీఆర్ ఓసీలోని కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్

సింగరేణి(కొత్తగూడెం): ఏప్రిల్ మాసానికి సంబంధించి నిర్దేశిత బొగ్గు ఉత్పత్తిలో 97శాతం లక్ష్యాన్ని సింగరేణి.. మేలో 102 శాతం ఉత్పత్తి నమోదు చేసింది. ఈ నెలలో 57,81,900 టన్నుల లక్ష్యానికి గాను 58,72,118 టన్నుల ఉత్పత్తి సాధించారు. సింగరేణి వ్యాప్తంగా 24 భూగర్భ గనుల్లో 6,84,900 టన్నుల లక్ష్యానికి 4,62,287 టన్నులు(67 శాతం), 18 ఓపెన్‌కాస్ట్ గనుల్లో 50,97,000 టన్నులకు 54,09,831 లక్షల టన్నులు(106 శాతం) ఉత్పత్తి నమోదైంది. మొత్తం ఆర్థిక సంవత్సరంలో మొదటి రెండు నెలల్లో 1,13,89,500 టన్నుల లక్ష్యానికి గాను 1,14,46,309 టన్నులతో వంద శాతం ఉత్పత్తి సాధ్యమైంది.

ఇల్లెందులో అత్యధికం..

సింగరేణి సంస్థ కొత్తగూడెం రీజియన్ పరిధి ఇల్లెందులో 138శాతం ఉత్పత్తితో అగ్రస్థానంలో నిలవగా, మణుగూరు ఏరియా 122 శాతంతో రెండో స్థానం, 114 శాతంతో కొత్తగూడెం ఏరియా మూడో స్థానంలో నిలిచాయి.

ఏప్రిల్, మేలో ఏరియాల వారీగా ఉత్పత్తి వివరాలు..

ఏరియా	లక్ష్యం (టన్నుల్లో)	ఉత్పత్తి	శాతం
ఇల్లెందు	5,20,000	7,07,000	136
మణుగూరు	19,47,327	24,08,104	123
కొత్తగూడెం	20,27,000	22,90,425	113
బెల్లంపెల్లి	5,77,308	6,41,287	111
ఆర్జీ–2	14,99,554	15,16,708	101
ఆర్జీ–3	8,72,692	8,27,661	94
ఆర్జీ–1	7,64,292	6,94,441	91
మందమర్రి	7,29,558	6,28,545	87
శ్రీరాంపూర్	12,28,904	9,35,664	76
అడ్రియాల	2,85,504	1,20,724	42
భూపాలపల్లి	7,63,962	5,26,908	69
మొత్తం	1,11,67,119	1,12,49,682	100.74

వార్షిక లక్ష్యాలను అధిగమించాలి..

ఏప్రిల్‌లో సాధించిన ఉత్పత్తితో పోలిస్తే మేలో మరింత పెరిగింది. అధికారులు, కార్మికులు, ఉద్యోగుల సమష్టి కృషితో ఇది సాధ్యమైంది. ఇదే స్ఫూర్తితో పనిచేస్తే వార్షిక లక్ష్యాన్ని సులువుగా అధిగమించవచ్చు. ఓపెన్‌కాస్ట్ గనులకు సంబంధించిన ఓబీ రిమూవల్ పనులు వేగం పెంచాలి. సింగరేణి వ్యాప్తంగా 18 ఓపెన్ కాస్ట్ గనుల్లో రోజుకు సుమారు 16 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ తీయాల్సి ఉంటుంది. ఈ విషయమై అధికారులు చొరవ తీసుకుని అంతరాయం వాటిల్లకుండా చూడాలి.

– సింగరేణి డైరెక్టర్ పా ఎస్ బలరామ్

వచ్చే నెలలో కొత్త వేతనం

- సింగరేణిలో అమల్లోకి 11వ వేజ్‌బోర్డ్ నిర్ణయాలు
- సుమారు 42 వేల మంది కార్మికులకు లబ్ధి



సింగరేణి ప్రధాన కార్యాలయం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులకు సంబంధించి పదో వేజ్‌బోర్డ్ సవరణ 2021 జూన్ 30వ తేదీతో ముగియగా, 11వ వేజ్‌బోర్డ్ ఈ నెల నుంచే అమల్లోకి రానుంది. జూలైలో కార్మికులు కొత్త వేతనం అందుకోనున్నారు. సుమారు 23 నెలలపాటు జరిగిన సమావేశాల్లో కార్మికుల జీతభత్యాల అంశం కొలిక్కి వచ్చింది. ఇందులో భాగంగా ఒకటో కేటగిరీ కార్మికుడు 26 రోజులపాటు క్రమం తప్పకుండా పనిచేస్తే వస్తున్న వేతనం రూ.26,293 నుంచి ఇప్పుడు రూ.39,069కి చేరనుంది. అంటే గత వేజ్ బోర్డ్‌లో పోలిస్తే రూ.12,776 పెరిగినట్లవుతుంది. ఈమేరకు రోజుకు రూ.496 జీతం పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో 19శాతం మినిమమ్ గ్యారంటీ బెనిఫిట్‌తో పాటు 25 శాతం ఇతరత్రా అలవెన్స్‌లు కలిపి ఉంటాయి. కాగా పెంచిన అలవెన్స్‌ల్లో 10వ వేజ్‌బోర్డ్‌లో ఎన్‌డీఏ రోజుకు రూ.18.15 ఉండగా, ప్రస్తుతం రూ.26.97కు పెంచారు.

సంస్థపై రూ.70 కోట్ల భారం

కోల్‌కతాలో గత నెల 18, 19వ తేదీల్లో జరిగిన 11వ వేజ్‌బోర్డ్‌లో పదో సమావేశంలో 19శాతం మినిమమ్ గ్యారంటీ బెనిఫిట్, 25శాతం ఇతర అలవెన్స్‌లు కలిపి నూతన వేతనాలు నిర్ధారించారు. తద్వారా సంస్థపై రూ.70 కోట్ల భారం పడనుందని జీఎం పర్సనల్(ఐఆర్‌పీఎం) ఏ.కుమార్‌రెడ్డి వెల్లడించారు. సంస్థలో ఒకటో కేటగిరీ నుంచి ఆరో కేటగిరీ, సూపర్‌వైజర్లు, ఇతర ఉద్యోగులు సుమారు 42 వేల మంది పనిచేస్తున్నారని తెలిపారు. ఈ నెల నుంచే వేతన పెంపు అమలు జరుగుతుందని, సింగరేణి ఉన్నతాధికారులు ఆమోదం తెలిపితే జూలై 3న కార్మికులు కొత్త వేతనం అందుకుంటారని జీఎం పేర్కొన్నారు.

సింగరేణి వ్యాప్తంగా ఆవిర్భావ సంబరాలు



సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ బలరాం

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణ ఆవిర్భావ సంబరాలను సింగరేణిలో ఈనెల 2, 5వ తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నామని డైరెక్టర్ (పా) ఎస్.బలరామ్ వెల్లడించారు. కొత్తగూడెంలోని కార్పొరేట్ కార్యాలయంలోని గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. ఈనెల 2వ తేదీ శుక్రవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరణ ఉంటుందని తెలిపారు. అనంతరం కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో కూడా ప్రత్యేక నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇక 5వ తేదీన ప్రకాశం స్టేడియంలో జరిగే సెంట్రల్ ఫంక్షన్‌కు ప్రజాప్రతినిధులతో పాటు అన్ని యూనియన్ల నాయకులు, కార్మికులు, కార్మిక కుటుంబాలను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ఎన్వీ.శ్రీనివాసరావు, వెంకటేశ్వరరెడ్డి, అధికారులు ఏ.కుమార్‌రెడ్డి, కట్టా బసవయ్య పాల్గొన్నారు.

మతం పేరుతో ఆదివాసీలను విభజిస్తే సహించం

మాజీ ఎంపీ మిడియం బాబూరావు



సభలో మాట్లాడుతున్న మిడియం బాబూరావు

కామేపల్లి(కారేపల్లి): మతం పేరుతో ఆదివాసీలను విభజించాలని చూస్తే సహించేది లేదని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎంపీ మిడియం బాబూరావు అన్నారు. అలాగే, మణిపూర్‌లో జరుగుతున్న మారణహోమాన్ని అడ్డుకునేందుకు కేంద్రప్రభుత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. కామేపల్లి మండలం కొత్తలింగాలలో సంఘం జిల్లా మూడో మహాసభలకు వజ్జా రామారావు, కింద రామచంద్రయ్య, రవ్వ రమణ అధ్యక్షత వర్గంగా నిర్వహించారు. ఈ సభలో బాబూరావు మాట్లాడుతూ ఆదివాసీలను అణచివేయాలనే లక్ష్యంతో బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతలు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో మత విద్వేషాలను రెచ్చగొట్టడంలో భాగంగానే మతం మారిన ఆదివాసీలపై బుల్లెట్ల వర్షం కురిపిస్తామని ఒక ప్రజాప్రతినిధి బెదిరించడం గర్హనీయమన్నారు. నాయకులు బండ్ల జోగయ్య, కారం పుల్లయ్య, వజ్జా సురేష్, గౌరీ నాగేశ్వరరావు, వజ్జా రామారావు, దుగ్గి కృష్ణ, సీతారాములు, పెంటయ్య, గంగరాజు, సర్ప వీరస్వామి, దుగ్గి పాపారాణి, నరసింహారావు, కంకటి పుల్లయ్య, కుర్సం శ్రీనివాస్, బొడ్డు సతీష్, ఎల్లబోయిన రాఘవులు పాల్గొన్నారు.

'దేశాన్ని లూటీ చేస్తున్న మోదీ ప్రభుత్వం'

ఖమ్మంమయూరిసెంటర్: అధికారం కోసం ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిన మోదీ ప్రభుత్వం ప్రజలను కొల్లగొట్టి, కార్పొరేటర్లకు కట్టబెడుతూ దేశాన్ని లూటీ చేస్తోందని ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.జనార్దన్ విమర్శించారు. ఖమ్మంలో గురువారం భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంఘం (ఇఫ్టూ అనుబంధం) జిల్లా మూడో మహాసభలు జరగగా, నగరంలో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మహాసభలో జనార్దన్ మాట్లాడుతూ.. దేశంలోని అన్ని వర్గాల ప్రజలను మోదీ ప్రభుత్వం ఇబ్బందుల పాలు చేస్తోందని మండిపడ్డారు. పేద, మధ్య తరగతి ప్రజలు నిత్యావసరాలు కొనుగోలు చేయలేని స్థితికి చేరుకున్నారని, మరోపక్క కార్మికుల కనీస హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఆవునూరి మధు మాట్లాడుతూ.. భవన ఇతర నిర్మాణ కార్మికులు, అన్ని రంగాల కార్మిక వర్గం మోదీ, కేసీఆర్‌లు అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. తొలుత ఇఫ్టూ పతాకాన్ని రాష్ట్ర అధ్యక్షుడు గంటా నాగయ్య ఎగురవేయగా.. గుగులోత్ పటేల్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్, నాయకులు కోలా లక్ష్మీనారాయణ, షేక్ సుభహాన్, ఐ.వెంకన్న, బోడ నాగేశ్వరరావు, సందీప్, కొండల్, గౌని మోహన్ రావు, కృష్ణ, భద్రమ్మ, పున్నమ్మ, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గురుకులాల్లో దశాబ్ది ఉత్సవాలు

భద్రాచలం: గిరిజన గురుకుల కళాశాలలు, పాఠశాలల్లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని భద్రాచలం ఐటీడీఏ ఏపీఓ(జనరల్), గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్ తెలిపారు. హైదరాబాద్ నుంచి తెలంగాణ రాష్ట్ర గురుకుల సొసైటీ కార్యదర్శి రోనాల్డ్‌రోస్ వీసీ ద్వారా పలు సూచనలు చేశారు. గురుకులాల్లో జరిగిన అభివృద్ధి, ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల ఫొటోలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని, ఉత్సవాల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొనేలా చూస్తూ భోజన వసతి కల్పించాలని ఆదేశించారు. అలాగే, పాఠశాలలు పునఃప్రారంభం కానున్న దృష్ట్యా ఏర్పాట్లపై దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలో చేస్తున్న ఏర్పాట్లను డేవిడ్‌రాజ్ వివరించారు.

ఐటీ హబ్ వాచ్‌మెన్ మృతి

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని ఐటీ హబ్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న వ్యక్తి మృతి చెందాడు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం బుద్దారానికి చెందిన బాసిపొంగు ప్రభాకర్(44) బుధవారం మధ్యాహ్నం విధుల్లో చేరాడు. రాత్రి 9గంటల సమయాన రక్తం కక్కుతూ కింద పడిపోగా సహచర ఉద్యోగులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కాగా, ప్రభాకర్ భార్య జయ తన భర్త మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని గురువారం ఖమ్మం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేస్తున్నారు.